# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 81 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 5, బృహస్పతి తిరస్కారం

దక్షుడు అరవైమంది కూతుర్లకీ పెళ్ళి చేసాక రచన అనే ఆవిడకి విశ్వరూపుడు పుట్టాడు. ఈయన బృహస్పతి అంతటివాడు. బృహస్పతి స్థానంలో ఈ విశ్వరూపుడు దేవగురువుగా వచ్చాడు అని శుకహమర్షి చెప్పేసరికి పరీక్షిత్తు అడుగుతున్నాడు ఇదెలా జరిగిందో.

సీ. “అరయంగ యోగీంద్ర! యద్భుతం బయ్యెడు;
సురలపై నేటికి సురగురుండు
గోపించె? నీతండు గురుభావమున దేవ;
తల కేమి యాపదఁ దలఁగఁ జేసె?
నెఱిఁగింపు" మనవుడు "నింద్రుండు త్రిభువనై;
శ్వర్య మదంబున సత్పథంబు
గానక వసు రుద్ర గణములు నాదిత్య;
మరుదశ్వి దేవాది మండలములు [6-259]

తే. సిద్ధ చారణ గంధర్వ జిహ్మగాది
సురులు మునులును రంభాది సుందరాంగు
లాడఁ బాడంగ వినుతి చేయంగఁ గొలువఁ
గ్రొక్క భద్రాసనంబున నుక్కుమీఱి. [6-259.1]

యోగీంద్రా, ఇదేదో అద్భుతంగా ఉందే, అసలు బృహస్పతి (సురగురుడు) దేవతలమీద కోపం ఎందుకు తెచ్చుకున్నాడు? దేవతలు ఆయకేదో ఆపద కలగచేసి ఉండొచ్చా? ఇలా అడిగే సరికి శుకమహర్షి చెప్తున్నాడు సమాధానం. త్రిభువనుడయ్యాక ఇంద్రుడికి సత్పథం అనేది తెలియక, ఐశ్వర్యమదంవల్ల, అన్ని గణాలు సేవిస్తూండగా, రంభవంటి సుందరాంగులు తన సభలో నాట్యమాడుతూంటే, సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు ఒకసారి. అప్పుడాయన శచీదేవితో పాటు నిండుపున్నమినాటి చంద్రుడిలాగా ఉన్నాడు. కూడా ఉన్న దేవతలూ అష్టదిక్పాలకులూ సేవిస్తున్నప్పుడు ఇంద్రుడు రాజసంతో ఉట్టిపడుతూ కూర్చునున్నప్పుడు,

క. గురుతర ధర్మక్రియ నయ
గురుఁడున్ గురుమంత్ర విషయ గురుఁడు వచ■్శ
గురుఁడు సమస్తామరగణ
గురుఁడు గురుం డరుగుదెంచెఁ గొల్వునకు నృపా! [6-262]

ఆ సమయంలో దేవగురువు సభలోకి ప్రవేశించాడు. ఈయన ఎటువంటివాడు? సమస్తామరగణ గురుడు – అన్ని అమరగణాలకీ గురువు, ధర్మం చెప్పే గురువు. గురుమంత్రం అనే విషయం తెల్సిన గురువు. వచ■్శ – వాక్కు అనే సంపదలకి గురువు.

చ. అమిత తపఃప్రభావుఁ గరుణాత్ముని గీష్పతిఁ జూచి రాజ్యదు
ర్దమ మదరేఖ నింద్రుఁడు వృథా తనగద్దియ లేవకుండె నె
య్యమున నెదుర్కొనం జనక యాసన మీయక గౌరవోప చా
రములఁ బ్రసన్నుఁ జేయక తిరంబుగ దివ్యసభాంతరంబునన్. [6-263]

ఇటువంటి అమిత తపఃప్రభావుడైన గురువు సభలోకి రావడం చూసి కూడా ఇంద్రుడు తన ఆసనం మీదనుంచి లేచి తగిన మర్యాదా, గౌరవం చూపించలేదు. ఎందువల్ల? ముందు చెప్పిన ఐశ్వర్య మదం వల్ల, గురువుని చూసీ కూడా సరైన గౌరవం ఇచ్చి ఉపచారాలు చేయలేదు. అసలు దేవేంద్రుడికి ఈ ఐశ్వర్యం, త్రిలోకాధిపత్యం రావడానిక్కారణం, గురువు. గురువంటే సాక్షాత్తూ ప్రరబ్రహ్మ స్వరూపం. అటువంటి వారికి ఇలా చేయవచ్చా?

క. అప్పుడు సురపతి గన్నులఁ
గప్పిన సురరాజ్య మదవికారంబునకుం
జప్పుడు జేయక గృహమున
కప్పుణ్యుఁడు దిరిగిపోయె నతిఖిన్నుండై. [6-264]

ఈ దేవేంద్రుడి కళ్ళు కప్పేసిన మదానికి దేవగురువు ఖిన్నుడై సభలో ఏ గొడవా చేయకుండా వెనక్కితిరిగి వెళ్ళిపోయాడు. గమనించారా? ఆ సమయంలో గురువు దేవేంద్రుణ్ణి శపించవచ్చు, కానీ అలా చేయకుండా వెనక్కి వెళ్ళిపోయాడు, ఎందువల్ల? ఆయన పుణ్యాత్ముడు కనక (పుణ్యుడు దిరిగిపోయె). ఈ విషయంలో శివానందులు చెప్పిన విషయం గుర్తు తెచ్చుకుందాం. భగవంతుణ్ణి చేరడానికి దారి చూపించే ఆయన, మనకీ భగవంతుడికీ మధ్య ఉన్న వారధి ఈ గురువు మాత్రమే. భగవంతుడి మనమీద కోపం వస్తే గురువు నానా తంటాలు పడి మనని మళ్ళీదారిలో పెట్టగలడు. కానీ గురువుకి కోపం వస్తే? అప్పుడు భగవంతుడు కూడా ఏమీ చేయలేడు. అందువల్ల భగవంతుడి కంటే కూడా ఎప్పుడూ ఆయనని చేరుకునే మార్గం చూపించే గురువే ఎక్కువ. అటువంటి గురువుకి అసలు కోపం రానేరాదు; వచ్చినా మనని శపించడానికి సిద్ధపడరు. కొంచెం తాటాకు మంట లాంటి కోపం వచ్చినా అది మనసులో ఉంచుకునే వారు కాదు. అందుకే పుణ్యాత్ముడైన శపించలేదు దేవేంద్రుణ్ణి కానీ అక్కడున్న వారిని కానీ.

చ. ఎఱుఁగమిఁ జేసినట్టి గురుహేళన మంత నెఱింగి యింద్రుఁ డ
చ్చరుపడి భీతినొంది యతిచింతితుఁడై తలపోసి పల్కె "న
ప్పరమపవిత్రు లోకనుతభవ్యచరిత్ర విశేషు పాదపం
కరుహముఁ బూజ చేయక యకర్మముఁ జేసితి నల్పబుద్ధి నై. [6-265]

అయితే తాను చేసిన పని – ఈ రంభ నాట్యం, అవీ అయ్యేసరికి దేవేంద్రుడికి తెలిసి వచ్చాయి. “అయ్యో, పరమపవిత్రుడైన ఈ గురువు పాదాలకి పూజ చేయక పాపం చేసాను అల్పబుద్ధితో” అని భయంతో చింతించాడు. త్రిభువనాలనీ అధిపతిని అన్న భావనతో గర్వం ఎక్కువైపోయి ఈయనని అగౌరవపరచాను. ఇటువంటి పాపం చేసినందుకు అనుభవించి తీరాలి కాబోలు. దీనివల్ల అధోగతి తప్పదేమో?

ఉ. కావున లోకవందితుని కార్యవిచారుని యింటి కేగి త
త్పావన పాదపద్మములపై మకుటంబు ఘటిల్ల మ్రొక్కి త
త్సేవ యొనర్చి చిత్తము వశించి ప్రసన్ను నొనర్తు నంచు న
ద్దేవవిభుండు పోయె నతితీవ్రగతిన్ గురుధామ సీమకున్. [6-269]

అందువల్ల లోకవందితుడైన ఆ దేవగురువు ఇంటికి వెళ్ళి నా తలమీద కిరీటం ఆయన కాళ్ల మీద పడేలాగా పడి ప్రసన్నుణ్ణి చేసుకుంటాను అనుకుని అతి వేగంగా బృహస్పతి ఇంటికి బయల్దేరాడు.

సీ. ఈరీతిఁ దనయింటి కేతెంచు దేవతా;
పతి రాక యా బృహస్పతి యెఱింగి
యధ్యాత్మమాయచే నడఁగి యదృశ్యుఁ డై;
పోయె నప్పుడు దేవపుంగవుండు
సకలంబుఁ బరికించి జాడఁ గానక గురు;
జింతించి తలపోసి చిన్నపోయెఁ;
బోయిన విధ మెల్ల దాయలు రాక్షస;
వీరులు వేగులవారివలనఁ [6-270]

తే. దెలిసి మిక్కిలి తమలోనఁ దెలివినొంది
యందఱును గూడి భార్గవు నాశ్రయించి
తత్కృపాదృష్టిఁ దమశక్తి దట్టమైన
దేవతలమీఁది దాడికిఁ దెరువు పెట్టి. [6-270.1]

ఇలా వచ్చే ఇంద్రుడి గురించి తెలిసింది దేవగురువుకి. అధ్యాత్మ మాయతో అదృశ్యుడై దేవేంద్రుడికి కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా దేవగురువు కనిపించకపోయేసరికి చిన్నబోయిన దేవేంద్రుడూ దేవతలూ ఏం చేయాలో తెలినప్పుడు ఈ విషయం — ఎల్లకాలం రక్షించే గురువు దేవేంద్రుణ్ణి వదిలేసిన విషయం — చారుల వల్ల రాక్షసులకి తెలిసింది. వెంఠనే తమ గురువైన భార్గవుణ్ణి — శుక్రాచార్యులని ఆశ్రయించారు. ఆయన కృపతో వెంఠనే దేవతల మీద దాడికి బయల్దేరారు. అధ్యాత్మ మాయ అనేదాని గురించి కిందన చూద్దాం.

కొంచెం లోతుగా ఆలోచిస్తే తెల్సేది ఏమిటంటే ఓ సారి గర్వం, మదం అనేవి రాగానే మంచి మార్గంలోంచి కిందకి జారడం మొదలైంది. అప్పుడు మనలో రాక్షస గుణాలు మర్రి చెట్టులా వృద్ధి చెందడం, సగుణాలని నాశనం చేసి మనని కిందకి లాగడం ప్రారంభిస్తాయన్నమాట. ఎందుకిదంతా అంటే,

మదగర్వం వల్ల. అంటే ఒక్కసారి చెడుగుణాల్లో దేనికైనా కొంచెం దారి ఇస్తే దానివల్ల మిగతా అసురభావాలన్నీ ఒక్కొక్కటే పురివిప్పుకుంటూ బయటకొస్తాయి. ఒక్కసారి ‘చిన్న అబద్ధం ఆడితే ఏమీ అవదులే’ అనే స్థితి నుంచి కొంచెం పెద్ద అబద్ధం, ఆ తర్వాత మరింత పెద్దదీ, అక్కడనుంచి మద, మోహ, మాత్సర్యాలన్నీ మనని ఆక్రమించుకుంటాయన్నమాట. అందుకే బ్రహ్మజ్ఞానం వచ్చాక కూడా నిరంతరం తప్పనిసరిగా సాధన చేస్తూనే ఉండాలి అంటారు శివానందులు. అదీగాక మనం చేసిన పాపానికి కర్మ, దాని ప్రభావం పూర్తిగా అనుభవించేదాకా ఈ పతనం తప్పదు. ఈ లోపున మరోసారి గురువు అనుగ్రహం సంపాదించి పైకి లేస్తాం. అలా పడుతూ లేస్తూ ఉండడమే ఈ దేవదానవ సంగ్రామం.

క. ధూర్తులు సమస్త కిల్బిష
మూర్తులు వర ధర్మ కర్మ మోచిత మార్గా
వర్తులు దుర్ణయ నిర్మిత
కీర్తులు దానవులు చనిరి గీర్వాణులపై. [6-271]

పైన చెప్పిన విధంగా ఒకసారి అసురగుణాలు మొదలవగానే ఏమైంది? ధూర్తులు, అనేక పాపమూర్తులైన దానవులు మిగిలిన సురగణాలమీదకి వెల్లువగా వచ్చారు. అంటే దేవతలమీదకి రాక్షసులు దండెత్తుకుని వచ్చారు. దేవతలకో గురువు ఉన్నట్టే ఈ రాక్షసులకి గూడా శుక్రాచార్యుడో గురువు.

స్రగ్ధ. దండిం గోదండ కాండోద్ధత రథ హయ వేదండ దండంబుతోడన్
దండెత్తెన్ మెండుగా నద్దనుజనికరముల్ దైవవర్గంబు మీఁదం
జండబ్రహ్మాండ భేదోచ్ఛ్రయ జయరవముల్ సర్వదిక్ క్షోభగా ను
ద్దండప్రఖ్యాత లీలం దలపడిరి సురల్ దర్పులై వారితోడన్. [6-272]

ఈ పద్యవృత్తం స్రగ్ధర అనేది గమనించారా? ఒక్కసారి చిన్న సందు ఇవ్వగానే అప్పటివరకూ తెలియనట్టూ అణిగి ఉన్న అసురగుణాలన్నీ ఒక్కసారి ధనస్సు, రథ, హయ (గుర్రాలతో, కోరికలు గుర్రాలు కదా), వేదండ (ఏనుగు) అనేవాటిలాగా బ్రహ్మాండ జయరవాలు అన్ని దిక్కులూ మోగేలాగ బయటకొచ్చి మంచి గుణాలతో తలపడ్డాయి. ఇదే దేవదానవ సంగ్రామం. ఇప్పుడీ స్థితిలో మనని రక్షించేదెవరు? మద, మోహ, మత్సర్యాలు మనని చంపుతూ ఉంటే మనని రక్షించేది గురువు ఒక్కడే. ఆ గురువు ఇప్పుడు అధ్యాత్మమాయతో కనిపించకుండా పోయాడు కదా మరెలా?

ఈ అధ్యాత్మ మాయ అనేదో మంచి విషయం. ఎప్పుడైతే అసురగుణాలకి తావివ్విడం మొదలుపెట్టామో అప్పుడు గురువు పక్కకి తప్పుకుంటాడు – ‘నా మాట విననప్పుడు నన్నేం చేయమంటావు?’ అనుకుని. ఆ తర్వాత జరిగే కర్మ అంతా అనుభవించాక మరోసారి స్పృహలోకి వచ్చి శరణు కోరుతూ గురువు దగ్గిరకి చేరతాం. ఆ స్థితిలో గురువు మనని పొమ్మనడు ఎందుకంటే చేసిన తప్పుకు చేతులు కాలాయి, కర్మ అనుభవించాం. ‘సరే, పోనీలే మరోసారి ప్రయత్నం చేయి’ అంటూ ప్రోత్సహిస్తాడు గురువు. అయితే గురువు ఎందుకు కనిపించకుండా పోయాడు? సర్వత్రా ఉన్న భగవంతుడు గురువు రూపంలో ఉండాలి కదా? కనిపించకపోవడం ఏమిటి, ఈ అధ్యాత్మ మాయ ఏమిటీ అని ఆలోచిస్తే మనకి తెలిసేదేమంటే, మార్పు వచ్చినది మనలో, గురువులో కాదు. గురువెప్పుడూ ఒకేలాగ ఉన్నాడు. కానీ ఆయనున్నది పైనున్నమంచి అధ్యాత్మ స్థితిలో. అసురగుణాలతో కిందకి జారినది మనమే, గురువు కాదు. అందువల్ల అధ్యాత్మ మాయ ఆవరించినది మననే. ఆ మాయలోంచి బయటపడగానే ఎప్పటిలాగా గురువు కనిపిస్తాడు.

చ. మదమున దేవదానవులు మచ్చరముల్గదుఁ బిచ్చలింప సం
పదలను గోరి పోరునెడ భార్గవ మంత్రకళా విశేషులై
యెదురులు వాలి నస్త్రమున నేయ మహాసురు లేచియేచి పెం
గుదులుగఁ గ్రువ్వ దేవతలు కోల్తల కోర్వక వీఁగి రయ్యెడన్. [6-273]

ఎప్పుడైతే అసురగణాలు దండెత్తుకొచ్చాయో, మనం గురుమార్గంలోంచి తప్పుకుని కిందపడడం మొదలుపెట్టాం కనక ఆ అసురగణాలు విశేషంగా — భార్గవమంత్రకళలతో — దండయాత్ర సాగించారు. ఒక్క చెడుగుణంతో మిగతా చెడుగుణాలన్నీ కట్టకట్టుకుని వచ్చి మనలో ఉన్న మంచిగుణాలని ఏరిపారేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నమాట. ఈ అసురగణాలు వేసే అస్త్రాలే మద, లోభ, మోహ మాత్సర్యాలనేవి. ఏ మాత్రం చిన్న సందు ఇచ్చినా వీటివల్ల సర్వనాశనం తప్పదు.

చ. దనుజుల గర్వరేఖయును దానవవీరుల యంపజోకయున్
మనుజవిశేష భోజనుల మచ్చరికంబు నిశాటకోటి యే
చిన బల శౌర్యముం దమకు సిగ్గును హాని మహాభయంబు ని
ర్గుణతను జేయు నుమ్మలికఁ గోల్తల కోర్వక పాఱిరార్తు లై. [6-276]

ఇలా జరిగిన దేవ దానవ యుద్ధంలో దానవులు (నిశాటాకోటి) చూపించిన బలశౌర్యాలకి తమకి సిగ్గూ, హాని భయం కలిగించేసరికి దేవతలు పారిపోయారు. మరోసారి ఆలోచిస్తే తెలిసేదేమంటే ఒక్కసారి ఈ చెడుగుణాలు మనని ఆవరించడం మొదలవగానే ఒక్కో మంచిగుణం మనలోంచి బయటకి వెళ్లడం మొదలౌతుందన్నమాట. గురుపథంలోంచి బయటపడి, “ఆ ఈ ఒక్కసారికీ ఏమీ కాదులే” అనుకుంటూ ఒక్కో మెట్టూ కిందకి దిగుతూ మొత్తానికి అధోగతి చేరుకుంటాం. అప్పుడేమౌతుంది? “కర్మ అనుభవించేటపుడు కానీ చేసిన పాపం గుర్తుకు రాదు అంటాడు” బుద్ధుడు. అలా అధోగతిలో ఉన్నప్పుడు గురువు గుర్తొచ్చి “అయ్యో ఇలా అయింది నన్ను కాపాడ్డానికి నువ్వు తప్ప ఇంకెవరూ లేరు (నీవే తప్ప నితః పరంబెరుగని... కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా.. గజేంద్ర మోక్షం 8.90)” అని మనసులో నిజంగా తెల్సినప్పుడు మరోసారి గురువు/భగవంతుడు మనకోసం బయల్దేరి వస్తారన్న మాట. ఎందుకలా వస్తారంటే మనం ఎన్ని తప్పులు చేసినా భగవంతుడు అపారకరుణాసాగరుడు కాబట్టి.

ఈ దీనమైన స్థితిలో, ఓడిపోయిన దేవతలు ఏం చేస్తారో వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS